## క్లుప్తంగా

### పరమేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం అర్బన్: ఉద్యమ నేత నూతలపాటి పరమేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ సిబ్బంది సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల సాధనలో పరమేశ్వరరావు కృషి మరువలేనిదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారీబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, సీనియర్ నాయకుడు పిల్లా తిరుపతిరావు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

విజయనగరం: నగరంలోని శిల్పారామంలో ఆంధ్రప్రదేశ్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ నేతృత్వంలో ఈ నెల 13 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం ముఖ్య కార్య నిర్వాహణాధికారి వి.స్వామినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ముగ్గుల పోటీలతో పాటు గాలిపటాలు ఎగురవేయనున్నట్లు చెప్పారు. 14న భరతనాట్యం, జానపద నృత్యాలు, కామిడీ స్కిట్స్ పోటీలు.. 15న ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### శని త్రయోదశి పూజలు



శనీశ్వరుడుకి పూజలు చేస్తున్న అర్చకుడు

బొండపల్లి: శని త్రయోదశి నేపథ్యంలో దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనీశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పుట్టిన నక్షత్రాల ప్రకారం తైలాభిషేకాలు చేశారు.


### ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, ఎన్‌జీఓ సంఘ సభ్యులు

లక్కవరపుకోట: ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఎన్‌జీఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ ఎన్‌జీఓ కొత్తవలస తాలూక అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు, సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. సంఘం జనరల్ సెక్రటరీ డి.శ్రీనివాస్ అసోసియేట్ ప్రెసిడెంట్ రామలక్ష్మణ్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరులు, జాయింట్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సభ్యులు వెంకటరమణ, సత్యారావు, శంకరరావు, ప్రశాంతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### ధ్యానం, యోగాతో ఆరోగ్యం



విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న కోటేశ్వరరావు

శృంగవరపుకోట: నిత్యం ధ్యానం, యోగాసాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ కార్యదర్శి శీల కోటేశ్వరరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బర్మా కాలనీలో విద్యార్థులకు శనివారం స్వామి వివేకానంద జీవిత చరిత్ర ను వివరించారు. వివేకానంద జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, వారితో ధ్యానం చేయించారు. మోక్ష విద్య యోగమందిర్ సభ్యులు మాడెం పార్వతి, కర్రి లలిత, వార్డు మెంబర్ పి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ అవస్థలు

రామభద్రపురం: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నాలుగు రాష్ట్రాల కూడలి కావడంతో పాటు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండడం వల్ల ఈ సమస్య ఇప్పుడు జటిలమైందని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ గంటల కొద్దీ వాహనాలు రోడ్లపైనే నిలిచిపోతున్నాయని, దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు ఆక్రమణలు తొలగించి, రోడ్డును విస్తరించాలని అలా చేస్తే కానీ ట్రాఫిక్ అవస్థలు ఉండవన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో జీవనోపాధి..

- కూరగాయలు, పూలు, పండ్ల సాగుపై రైతుల ఆసక్తి
- ఆరుతడి పంటలతో అధిక లాభాలు



పూసపాటిరేగలో సాగులో ఉన్న వంగ పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

పూసపాటిరేగ: ప్రతి ఏటా పెరుగుతున్న పెట్టుబడులు, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమైనా సాగు అంతంతమాత్రమేనే ఉంది. రబీ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలో సుమారు 12 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేపట్టాల్సి ఉండగా.. ప్రస్తుతం 6,500 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న సాగు కూడా అంతంతమాత్రంగానే ఉంది. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ముందుగా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల , డెంకాడ మండలాల రైతులు కూరగాయలు, పండ్లు, పూల సాగుపై ప్రధానంగా దృష్టి సారించారు. పూసపాటిరేగ మండల పరిధిలో కుమిలి, రెల్లివలస, పేరాపురం, వెంపడాం, తాళ్లపేట, గోవిందపురం, పూసపాటిపాలెం , కొవ్వాడ అగ్రహారం, గుంపాం, పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, పతివాడ, చౌడువాడ గ్రామాలలో కూరగాయలు సాగు చేస్తున్నారు. తీరప్రాంత గ్రామాలలో బోర్ల కింద మిరప, దొండ, బెండ, బీర, కాకర, కాప్సికమ్, టమాటా వంటి పంటలు సాగు చేస్తున్నారు. నెల్లిమర్ల మండలం టెక్కలి, కొండవెలగాడ, చంద్రమ్మపేట.. భోగాపురం మండలం చాకివలస, తూడెం గ్రామాలలో ఉద్యానవన పంటలైన బంతి, గులాబి, చామంతి, మల్లె, తదితర పూల తోటలు సాగు చేస్తున్నారు. రెండు, మూడు నెలల్లో దిగుబడులు చేతికి అందడంతో పాటు ఎరువులు, పురుగు మందులు ఖర్చులు తక్కువగా ఉండడంతో రైతులు కూరగాయలు, పూలతోటల వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.



టమాటా పంట

#### కూరగాయల సాగుకు రాయితీలు

కూరగాయలు, పూల తోటలు సాగు చేసేవారికి రాయితీలు కల్పిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం కలిగితే కూరగాయలకు ఎకరాకు రూ. 6 వేలు, పూల తోటలకు రూ. 6,250 పరిహారం ఇస్తాం. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాలకు రాయితీ వర్తిస్తుంది.

– జ్యోత్స్న, ఉద్యానవనశాఖాధికారి, భోగాపురం

#### పూలసాగుతో అధిక లాభాలు..

పూల సాగుకు ఎరువులు, పురుగుమందులకు ఎక్కువ ఖర్చు అవుతుంది. రెండు నెలల నుంచి పంట చేతికందివస్తుంది. దీంతో నిత్యం ఆదాయం వస్తుండడం విశేషం. తుఫాన్లు, భారీ వర్షాలు పడినా నష్టం తక్కువ.

– నారాయణప్పారావు, రైతు, చౌడువాడ

#### • ఆవిష్కరణ..



రాముడే శ్వాసగా, శ్రీరామయణమే భాషగా తీర్చిదిద్దేందుకు శ్రీరామనారాయణంలోని ఇటీవల ప్రారంభించిన వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌లో వారధి వాల్‌పోస్టర్‌ను శనివారం ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి 26 వరకు రీసెర్చ్ సెంటర్‌లో వారధి మన సారథి అనే మహాసదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

#### • మర్యాదపూర్వక కలయిక..



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ లక్ష్మణరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఎం సూర్యఘర్ పథకం, సోలార్ ప్యానళ్ల ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో పట్టణ ఏడీఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

– విజయనగరం

#### • అపూర్వ కలయిక



విజయనగరం మండలంలోని జొన్నవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో శనివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

– విజయనగరం రూరల్

## రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు..



రక్తదాతలతో విజయనగరం యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు

- విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇల్తమాస్

డెంకాడ: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎదుటవారి ప్రాణాలు కాపాడవచ్చని విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాస్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజనోత్సవాల్లో భాగంగా మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నెయిగాపుల రఘు, అనకాపల్లి అశోక్, సాయికుమార్, రాయల్ క్యాబ్ శరత్, రఘు, రాము, విజయ్, వినయ్, సాయి, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా కూడారై..



అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ధనుర్మాసోత్సవాలలో భాగంగా దుప్పాడ శ్రీక్షేత్రంలో కూడారై ఉత్సవం శనివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గణేష్‌శర్మ అమ్మవారికి దివ్యహారతులు ఇవ్వడంతో పాటు ప్రత్యేకపూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వడ్డే ఓబన్నకు నివాళులు..



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్వాతంత్ర్య సమరయోధుడు , రేనాటి ప్రాంతానికి చెందిన దివంగత వడ్డే ఓబన్న జయంతిని శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీపై తిరుగుబాటు చేసిన యోధుడు ఓబన్న అని కొనియాడారు. ఈస్టిండియా కంపెనీ ఇచ్చే భత్యం విషయంలో ప్రారంభమైన ఘర్షణలు, క్రమేపీ సాయుధ పోరాటాలుగా మారాయని.. ఆ పోరాటంలో పాల్గొన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఓబన్న సైన్యాధ్యక్షుడిగా వ్యవహరించి బ్రిటీష్ సైన్యాన్ని ఉరుకులు పెట్టించారని తెలిపారు. అతని త్యాగాలు భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి..



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్తున్న వలంటీర్లు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం ఫూల్‌బాగ్: తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని ఇచ్చిన మాట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. ఈ మేరకు ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి స్థానిక గంటస్తంభం వరకు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం నెలకు రూ. పది వేల జీతం చెల్లిస్తూ.. వలంటీర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పాడుగ రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, వలంటీర్లు పాల్గొన్నారు.

# వైభవంగా సంక్రాంతి సంబరాలు



డెంకాడ: భోగి మంట వేస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్



డెంకాడ: సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు



విజయనగరం అర్బన్: సీతం కళాశాలలో భోగిమంట

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్‌లోని యూనిట్ గ్రౌండ్‌లో ఎస్‌వీఎస్ ఏపీఎస్పీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ పాల్గొని భోగి మంటను వెలిగించారు. సంక్రాంతి సంప్రదాయం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేశారు. గోదాదేవి కల్యాణం, కోలాటం, ధింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు సోదమ్మ, బుడబుక్కలోడు, హరిదాసు, కొమ్మదాసు వంటి పలు రకాల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**సనాతన సంప్రదాయాలను పరిరక్షించాలి..**

విజయనగరం టౌన్: సనాతన సంప్రదాయలను పరిరక్షించడంలోనూ, ప్రోత్సహించడంలోనూ రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ కీలకపాత్ర పోషిస్తుందని క్లబ్ కార్యదర్శి, కంటోన్మెంట్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి అన్నారు. ఆలయ ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతీ, సంప్రదాయాలను కొత్త తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి రోటరీ గవర్నర్ ఎం.వెంకటేశ్వర్లు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రామారావు, శివ, జయకృష్ణ, శ్రీనివాస్, మధు, మారుతీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

**సీతంలో..**

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల ధ్వంసంపై విచారణ చేపట్టండి



ధ్వంసం చేసిన సామాజిక మరుగుదొడ్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నగర పాలక కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: నగరంలోని 40వ డివిజన్ పోలయ్యపేట ప్రాంతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక మరుగుదొడ్డిని కొందరు విధ్వంసం చేయడంపై వెంటనే విచారణ చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం అర్ధరాత్రి స్థానికులు గుర్తించి కమిషనర్‌కు ధ్వంసంపై ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే కమిషనర్ స్పందించి విచారణ చేపట్టాలని డీఈ మణికుమార్, సిబ్బందిని, సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. డీఈ మణికుమార్ నేతృత్వంలో శనివారం ఉదయం నిర్వహించిన విచారణలో కొంతమంది అపార్ట్‌మెంట్ భవన నిర్మాణదారులు ఈ విధ్వంసకర సంఘటనకు బాధ్యులుగా గుర్తించారు. దీంతో వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలయ్యపేటలో ఉన్న సామాజిక మరుగుదొడ్డి బహుళ భవనాల నిర్మాణదారులకు అడ్డంకిగా ఉందని భావించి.. దానిని వారు పూర్తిగా తొలగించి వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులుగా అనుమానిస్తున్న ఏఎల్ ఫలేష్, సత్యా వెంచర్స్ అండ్ కన్‌స్ట్రక్టర్స్, ఎస్.ఎస్. ట్రేడర్స్, ఎంబీవీ వెంచర్స్, నెక్స్‌ట్ జెన్ వెంచర్స్ నిర్వాహకులపై సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఎవరైనా ఇటువంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.